దశ
నిజం.. నిర్భయంగా..

03
సోమవారం
8-12-2025
WWW.DASHANEWS.COM



# విద్యార్థి ఇంటి ముందు టీచర్ల ధర్నా

❖ పాఠశాలకు పంపాలంటూ ఉపాధ్యాయుల నిరసన

**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆసక్తికర నిరసన ఘటన చోటు చేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు స్కూలుకు పంపించడం లేదని వారి ఇంటిముందు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరసనకు దిగారు. కాగా, దుమ్ముగూడెం మండలం నిమ్మలగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, నాలుగో తరగతి చదువుతున్న నక్కా మణువరన్ అనే విద్యార్థి దాదాపు వారం రోజులుగా స్కూల్‌కు వెళ్లడంలేదు. విద్యార్థిని రోజూ పాఠశాలకు పంపించాలంటూ ఉపాధ్యాయులు అతడి తల్లిదండ్రులను పలుమార్లు కోరినా వారు స్పందించ లేదు. దీంతో ప్రధానోపాధ్యాయుడు బి.రవి, ఉపాధ్యాయురాలు రుక్మిణి ఇతర విద్యార్థులతో కలిసి మణువరన్ ఇంటి ముందు ధర్నా చేశారు. దీంతో నేటి నుండి తమ బిడ్డను పాఠశాలకు తప్పకుండా పంపిస్తామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. విద్యార్థి తల్లిదండ్రులు మాటివ్వడంతో ఉపాధ్యాయులు, పిల్లలు ధర్నా విరమించారు.

# మాతృమూర్తి పేరున వైద్య సేవలు అభినందనీయం

❖ కులామతాలకతీతంగా బాషామియా అనేక సేవలు.

❖ నేడు లయన్స్ క్లబ్ సౌజన్యంతో ఉచిత వైద్య పరీక్షలు.

❖ సూర్యాపేట లో 200 మందికి పైగా కంటి పరీక్షలు సద్వినియోగం.

❖ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్.



**దశ, సూర్యాపేట:** మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ బాషామియా తన మాతృమూర్తి షేక్ ఖాజాబి పేరున వైద్య సేవలు చేయించడం అభినందనీయమని జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గిరి నగర్ 6 వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాషామియా మొదటినుంచి కులామతాలకతీతంగా అనేక రకాల సేవ కార్యక్రమాలు చేపట్టారన్నారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. అందుకే తమ వార్డుతోపాటు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించి భాషామియా ఇటువంటి కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నేడు 200 మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు. అందులో అవసరమైన వారికి కంటి అద్దాలు, ఆపరేషన్లు సైతం తానే స్వయంగా నిర్వహించనున్నట్లు బాషామియా తెలిపారు. కంటి పరీక్షల కోసం ప్రైవేటు దావఖానాకు వెళితే 10 నుంచి 15 వేల రూపాయలు వరకు ఖర్చు అవుతుందని.. ఇటువంటి సమయంలో తమకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయా వార్డుల ప్రజలు ఈ సందర్భంగా భాషామియా కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసాయిగూడెం మాజీ సర్పంచ్ దుబ్బ శ్యామ్, ఆయా వార్డుల నాయకులు దుబ్బ ప్రేమ్ కుమార్, ధరావత్ విజయ చక్రు నాయక్, వెంకటరమణ, ధారావత్ శివరాం, వెంకన్న, జానయ్య, సైదిరెడ్డి, బబ్లు, లక్ష్మణ్, ఉపేంద్ర చారీ, లక్ష్మీ, శ్రీను, తిరుపయ్య, సమ్మయ్య, రోజా గారు నారాయణ, వెంకటరమణ, లయన్స్ క్లబ్ సిబ్బంది బంగారు స్వాతి, వీరేంద్ర చారి పాల్గొన్నారు.



# ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

❖ అశ్వారావుపేట ఆచ్యుతాపురంలో ఎస్ఐ డ్రైవ్

❖ నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు!

❖ ఎస్ఐ అఖిల వార్నింగ్

**దశ, అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలోని ఆచ్యుతాపురం గ్రామంలో ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ కొనకంచి అఖిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈసందర్భంగా ఎస్ఐ అఖిల మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఎలాంటి భయం లేకుండా, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి అని తెలిపారు. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాదు, బాధ్యత కూడా" అని నొక్కి చెప్పారు.

### నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠిన చర్యలు

ఎన్నికల సందర్భంగా కొందరు అక్రమంగా డబ్బు, మద్యం పంపిణీ చేసి ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తారని, అలాంటి చర్యలకు తావివ్వకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హెచ్చరించారు. "ఎవరైనా నగదు లేదా మద్యం పంపిణీ చేసినా, తీసుకున్నా చట్టరీత్యా అది నేరమే.

అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని కోరారు.

### శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకూ పాల్పడరాదని ఆమె స్పష్టం చేశారు. గ్రామస్తులు నిష్పక్షపాతంగా ఓటు వేయడానికి, గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ అఖిల విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు, స్థానిక పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పిచ్చికుక్క స్వైర విహారం

## 36మందికి గాయాలు

**దశ, ఆమనగల్లు :** ఆమనగల్లులో ఆదివారం సాయంత్రం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ప్రధాన రోడ్ల తో పాటు పలు కాలనీలో సంచరించి కనిపించిన వారిపై ఎక్కడపడితే అక్కడ కరి సింది. చాలామందికి కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయత్నించినప్పటికీ వెంటబడి మరీ తన ప్రతాపాన్ని చూపింది. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని సైతం వదిలిపెట్టలేదు. పిచ్చికుక్క దాడిలో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. పిచ్చి కుక్క వీధుల వెంట తిరుగుతూ నడుచుకుంటూ వెళ్తున్న వారిపై వెంటపడి మరి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో 36 మంది గాయపడిన వారు స్థానిక ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతున్నారు. స్థానిక యువకులు పిచ్చికుక్కను కర్రలతో కొట్టి హతమార్చారు. యథెచ్చగా తిరుగుతూ దాడులు చేస్తున్న కుక్కలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.





# బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసిన మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్



**దశ, మునగాల:** మునగాల మండలం, మాధవరం గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏలక వెంకట రెడ్డి, మాధవరం గ్రామ శాఖ అధ్యక్షులు ధార వెంకన్నలను కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి గౌరవనీయులు బొల్లం మల్లయ్య యాదవ్ గారి ఆదేశానుసారం బిఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మునగాల మండల అధ్యక్షులు తొగర్ రమేష్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏ పదవిలో ఉన్న నిర్ధాక్షణంగా పార్టీ నుండి బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు.

# మోతె మండలంలో 7 గ్రామాల సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్న కాంగ్రెస్



**దశ మోతె:** మోతె మండల వ్యాప్తంగా 29 గ్రామ పంచాయతీలకు 7 గ్రామ పంచాయతీలు, రాయికుంట తండా, రాంపురం తండా, విబలాపురం, మావిళ్ళగూడెం, బల్లు తండా, లాల్ తండా, గోల్ తండా గ్రామాలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ కైవసం చేసుకుందనీ కీసర సంతోష్ రెడ్డి మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నారు. ఏకగ్రీవానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయ పూర్వక ధన్యాదములు తెలియజేశారు. మిగిలిన గ్రామాలలో కూడా కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో మంచి మెజారిటీతో గెలిచి మన ప్రియతమ రాష్ట్ర మంత్రివర్యులు మరియు కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి గార్లకు బహుమతిగా అందించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామని వారు అన్నారు.

# పల్లెల్లో ఆసక్తికరంగా మారిన రాజకీయం

❖ వలస ఓటర్లపై అభ్యర్థుల దృష్టి

**దశ, జనగామ :** గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ వలస ఓటర్లపై అభ్యర్థులు దృష్టి సారించారు . గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లపై ఆయా పార్టీల అభ్యర్థులు కన్నేశారు. గ్రామాల్లో ఉంటున్న వారితోపాటు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా కీలకంగా మారతాయి. ఈ క్రమంలో వారిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. నామినేషన్ల పర్వం ముగిసిన గ్రామాలతో పాటు నామినేషన్లు వేస్తున్న మూడో విడత అభ్యర్థులు సైతం వలస ఓటర్లపై దృష్టి పెట్టారు. తమ గ్రామంలోని ఓటర్లు ఏయే ప్రాంతాల్లో ఉంటున్నారన్న దానిపై ఆరాతీసి వారి ఫోన్ నంబర్లను సేకరించే పనిలో పడ్డారు.



### వలస ఓటర్లే కీలకం

గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఎన్నికల్లో చాలా సందర్భాల్లో వలస వెళ్లిన వారి ఓట్లే కీలకంగా మారతాయి. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వలస వెళుతుంటారు. హైదరాబాద్ లోని ఉప్పల్, జగద్గిరిగుట్ట, నాగోల్, చింతల్, బాలానగర్, ఈసీఐఎల్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. వీటితో పాటు బొంబాయి, సూరత్ వంటి ఇతర రాష్ట్రాల్లోనూ ఉంటారు. చాలా మంది ఎంత దూరం వలస వెళ్లినప్పటికీ గ్రామ పంచాయతీ ఎన్నికల సమయానికి ఓటు వేసేందుకు కచ్చితంగా వస్తుంటారు. ఇప్పటికీ గ్రామాల్లో ఓటు వేయడంపై చాలా మంది నిబద్ధతతో ఉంటారు. 'ఓటు వేయని వ్యక్తి మరణించిన వ్యక్తితో సమానం' అన్న భావన గ్రామీణుల్లో ఎక్కువగా ఉంటుంది.

# ప్రచార సమయంలో అల్లర్లు సృష్టించవద్దు

❖ మునగాల సీఐ రామకృష్ణా రెడ్డి

**దశ, నడిగూడెం :** రెండవ విడతలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నడిగూడెం మండలం పరిధిలోని గ్రామాలలో ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులకు నడిగూడెం కేంద్రంలో గల రైతు వేదిక నందు ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంజరిగింది.స్థానిక ఎమ్మార్వో, ఎస్సై, ఎంపీడీవో లతో కలిసి మునగాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో అంతా ఒక ఊరివారమై పోటీ పడుతున్నామని ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గ్రహించాలి అన్నారు. మండల పరిధిలో సత్ప్రవర్తన కోసం సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేశామని, బైండోవర్ అనేది కేసు కాదు సత్ప్రవర్తనతో ఉంటానని స్వయంగా రాసి ఇచ్చే హామీ పత్రమని సీఐ తెలిపారు. ప్రచార సమయంలో గొడవలు పెట్టుకోవద్దని వర్గ పోరుకుపోయి చెడ్డ పేరు మూట కట్టుకోవద్దని అన్నారు. ఒకసారి ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి పోలీస్ స్టేషన్ నందు హాజరు కావాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా



**దౌల్తాబాద్,దశ:** సిద్దిపేటజిల్లాదౌల్తాబాద్‌మండలంలోఈనెల 11 తొలి విడతతో గ్రామ పంచాయితి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. తోచిన మేర హామీలు ఇస్తూ... ప్రతి ఇంటి గడపను తట్టి వారికి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ గా ఆదరించి, అభిమానించి గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని దౌల్తాబాద్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి స్వప్న నందం అన్నారు. ఆదివారం వాడవాడలో కరపత్రాలు పంచుతూ తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. గ్రామంలోని అందరి అదరాభిమానంతో పోటీ చేస్తున్నానని ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండలంలోని ముభారస్‌పూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. సర్పంచి మరియు వార్డు మెంబర్ అభ్యర్థులు ఇంటికి తిరుగుతు తమ గుర్తులను చూపిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

